క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

పూతలపట్టు: మండల పోలీస్ స్టేషన్‌లో బుధవారం వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ రాంభూపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన ఓమిని వ్యాన్, ప్యాసింజర్ ఆటోను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఈ వేలం సెబ్ ఆఫీసర్ చిత్తూరు వారు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు 10.30 గంటల సమయంలో పూతలపట్టు పోలీస్ స్టేషన్ ఆవరణకు చేరుకోవాలని సూచించారు.

గుడిపాల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు రెండు వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన బొలెరో వాహనంతో పాటు స్కూటీ (ద్విచక్ర వాహనం)ని వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

డీఈఓకు వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బీటీఏ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా టీచర్స్ డేగా నిర్వహించాలని బీటీఏ జాతీయ సలహాదారు ఆంజనేయులు కోరారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు మంగళవారం డీఈఓ విజయేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జనవరి 3వ తేదీ సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా టీచర్స్‌డేగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రామచంద్రయ్య, విజయమోహన్, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి వేడుకలు



దత్తాత్రేయుడికి పూజలు చేస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీశిరిడీ విశ్వసాయిబాబా ఆలయంలో మంగళవారం దత్తజయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేక పూజలు చేశారు. పలు హారతులు పట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వారు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని తరించారు.

చెన్నైకి రైలు సౌకర్యం కల్పించాలి



స్టేషన్ మాస్టర్ ముత్తుస్వామికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు–చెన్నైకి రైలు సౌకర్యం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ కోరారు. మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ మాస్టర్ ముత్తుస్వామికి ఆయన వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా స్టేషన్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. చిత్తూరు మీదుగా పలు రైళ్లు వెళ్తున్నా, ఇక్కడ స్టాపింగ్ లేదన్నారు. అధిక సంఖ్యలో ఇక్కడి నుంచి విద్యార్థులు, ప్రజలు విద్య, వ్యాపార, వైద్యం కోసం చెన్నై వెళ్తుంటారని తెలిపారు. మదనపల్లె, పాకాల, చిత్తూరు, కాట్పాడి మీదుగా చెన్నైకు రైలు వెళ్లే విధంగా ఉండేలా చూడాలని కోరారు.

గుండె పోటుతో ఉపాధ్యాయుడి మృతి



గణేష్(ఫైల్)

తవణంపల్లె: మండలంలోని పట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కె.గణేష్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. సోమవారం పాఠశాలకు విధులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. చాతీ నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మంగళవారం ఎంఈఓలు హేమలత, త్యాగరాజులు రెడ్డి, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు బాబు రెడ్డి, ఉపాధ్యాయుల బృందం మృతి చెందిన గణేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బైక్ ర్యాలీ



నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ యువ కార్యకర్తలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ నగర యువజన విభాగం క్లస్టర్–1 అధ్యక్షుడిగా కట్టమంచికి చెందిన డీసీ మనోజ్‌రెడ్డి నూతనంగా నియమితులయ్యారు. మంగళవారం పార్టీ యువ కార్యకర్తలు, స్నేహితులు దొడ్డిపల్లె నుంచి గాంధీ విగ్రహం వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. థ్యాంక్స్ సీఎం సర్ అంటూ నినాదాలు చేశారు. యువతకు పార్టీ ప్రాధాన్యత ఇస్తోందని వారు తెలిపారు.

ఆడుదాం.. విజయపథాన నిలుద్దాం



అరగొండ బాలుర హైస్కూల్లో బ్యాటింగ్ చేస్తున్న మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి



తవణంపల్లె: ఆడుదాం..ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండల కేంద్రం బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం 'ఆడుదాం–ఆంధ్రా' క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు చాలా మంది ఉన్నారన్నారు. వారు ప్రతిభను చాటుకునేందుకు అవకాశం లేక మరుగున పడుతున్నారన్నారు. అలాంటి క్రీడాకారుల ప్రతిభను చాటుకునేందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ప్రోత్సహించి వారిని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా మాట్లాడుతూ వాలీబాల్ క్రీడకు బంగారుపాళెం పుట్టినిల్లు లాంటిదన్నారు. బంగారుపాళెం మండలం నుంచి నలుగురు క్రీడాకారులు అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారులుగా ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో సత్తాచాటి రాణించాలని ఆకాంక్షించారు. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి, సారే సోమశేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్లప్ప, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, కార్యదర్శి రఘుపతిరాజు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ రామరాజు, మండల ప్రత్యేక అధికారి విజయమోహన్, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ అనీల్‌కుమార్, ఎంఈఓ–2 రమేష్‌బాబు, హెచ్‌ఎం రాజేంద్ర, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి అన్నారు. మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంపీడీఓ నాగరాజు, ఎంఈఓలతో కలిసి ప్రారంభించారు. అలాగే మండలంలోని 19 సచివాలయాల పరిధిలో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు అట్టహాసంగా ప్రారంభించారు. కాణిపాకం క్రీడా మైదానంలో క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారులు రెండింటినీ సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుశీలమ్మ, మండల విద్యాశాఖ అధికారులు రుషేంద్రబాబు, దామోదర్ నాయుడు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం

యాదమరి: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని ఎంపీపీ సురేష్ అన్నారు. సోమవారం యాదమరి ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ క్రీడలు మానసికంగా ఉల్లాసాన్నిస్తాయన్నారు. మండల ప్రత్యేక అధికారి బోగంరెడ్డి, ఎంపీడీఓ శివరాజ్, వైఎస్ఆర్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్రాతో క్రీడాభివృద్ధి

గుడిపాల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడలు అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుడిపాలలో స్థానిక సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో యువతకు నైపుణ్యాన్ని పెంచేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం యువత క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయి, వెంకటేశులురెడ్డి, గుండు సాయి, శిలంబరసన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆడుదాం..ఆంధ్రా

తవణంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా ప్రారంభించారు. మండలంలోని అరగొండ బాలుర ఉన్నత పాఠశాల, తవణంపల్లె ఉన్నత పాఠశాలలోని మైదానంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి రిబ్బన్ కత్తిరించి ఆటల పోటీలను ప్రారంభించారు. అరగొండలో వినాయక స్వామికి పూజలు నిర్వహించారు. క్రీడా జ్యోతి వెలిగించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు క్రీడాకారులకు కిట్లు అందజేశారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లె, చెర్లోపల్లె, నలిశెట్టిపల్లె,తవణంపల్లె, పైమాఘం, అరగొండలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. అదే విధంగా సరకల్లులో వాలీబాల్, నలిశెట్టిపల్లెలో బ్యాడ్మింటన్ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు హేమలత, త్యాగరాజులు రెడ్డి, హెచ్‌ఎంలు భువనేశ్వరి, శ్రీరంజని, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు కిషోర్ రెడ్డి,పరమేశ్వరరెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, రవి రెడ్డి, పాల్గొన్నారు.



అరగొండ క్రికెట్ ఆటగాళ్లకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



యాదమరి ఉన్నత పాఠశాలలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సురేష్‌బాబు



గుడిపాల: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సంబరం

- ఐదు క్రీడల్లో 2022 మంది క్రీడాకారులు నమోదు
- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా «ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను చేపట్టారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు తెలిపారు. మంగళవారం పూతలపట్టు మండలం ఎర్రచెరువుపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆట మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూతలపట్టు మండలంలో జనవరి 9వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో జరిగే క్రీడా పోటీలకు ఐదు క్రీడల్లో చేరి 2022 మంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు. తొలుత మండల స్థాయి, ఆపై నియోజకవర్గ స్థాయి, తరువాత జిల్లా స్థాయి, చివరగా రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్రా పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ సీపీ పెనుగొండ పరిశీలకుడు బాబురెడ్డి, ఎంపీపీ కుమారి, సీనియర్ నాయకులు రాజారత్నంరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ దేవిక, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్, ఎంపీడీఓ గౌరి, ఎస్‌ఐ రాంభూపాల్, నాయకులు అమర్నాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మణి, రాణెమ్మ, ఆనందయ్య, మాసిలామణి, నిరంజన్‌రెడ్డి, షణ్ముగం, బాలాజీ, మండల యువత అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణారెడ్డి, చంద్రా, పీడీలు, అధికారులు, వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



వరదరాజుల స్వామి ఆలయంలో జరిగిన సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో వెలసిన మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ అలంకార మండపంలో సత్యనారాయణ స్వామి అవతారంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. భక్తులు హాజరై సత్యనారాయణ వ్రతం ఆచరించారు. వారికి ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందించారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై పురవీధులలో ఊరేగారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

కాణిపాకంలో అయోధ్య రామ ప్రచార రథం

- హారతులు ఇచ్చి స్వాగతం పలికిన ఆలయ ఈఓ వెంకటేశు



కాణిపాకం వీధుల్లో ఊరేగుతున్న అయోధ్య రామ మందిర ప్రచార రథం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్దకు అయోధ్య రామ మందిర ప్రచార రథం మంగళవారం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు కర్పూర హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఉదయం అయోధ్య రామ మందిరం ప్రచార రథం కాణిపాకం విచ్చేయగా ఆలయ ఈఓ, అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాడ వీధులలో మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం రామ మందిర ప్రచార రథంతో విచ్చేసిన అధికారులకు, అర్చక వేద పండితులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభం కానున్నందున వారికి కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అక్షింతలు, తీర్థాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవ రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్, అయోధ్య మందిర అధికారులు, తిలక్, ద్వివేది, వైష్ణవిదాస్, రాఘవేంద్రదాస్, రాంజీపాండే పాల్గొన్నారు.

అర్ధగిరి క్షేత్రంలో వైభవంగా పౌర్ణమి వేడుకలు

– భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు భక్తితో స్వామికి అభిషేకం చేయించారు. సుగంధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు.

కలశాలకు పూజలు

పౌర్ణమి సందర్భంగా ఆలయంలో అర్చకులు స్వామికి భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. ముందుగా కలశాల పూజలు చేశారు. తర్వాత అర్చకులు వేదమంత్రాలు పఠనం చేసి హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. హోమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి దంపతులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. రాత్రిలో భక్తుల నడుమ ఉత్సవమూర్తి పల్లకిలో కొలువుదీరి ప్రాకారోత్సవం నిర్వహించారు. పౌర్ణమి వేడుకలను తిలకించాడానికి విచ్చేసిన భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిస్తే రూ.5వేలు



మాట్లాడుతున్న వైద్యాధికారి సురేఖ

యాదమరి: రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.5 వేలు పారితోషికం అందిస్తున్నట్లు యాదమరి వైద్యాధికారి సురేఖ తెలిపారు. సోమవారం ఉదయం మండలంలోని 180 మజరా కొత్తపల్లె గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామీణ ప్రజలకు వివరించారు. మొదటిసారి గర్భం దాల్చిన గర్భవతులకు కేంద్ర ప్రభుత్వం చేయూతనందించేందుకుగాను ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద రూ.6 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే రెండో కాన్పులో ఆడబిడ్డకు జన్మనిస్తే వారికి రూ.5వేలు అందిస్తున్నట్లు వివరించారు. క్షయ వ్యాధికి రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలకు సరిపడా మందులు ప్రస్తుతం ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక లాలూగార్డెన్–2 డివిజన్‌లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సచివాలయ పరిధిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొంటారని పేర్కొన్నారు.


ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ రమణ

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం నాయకులు యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బకాయిలను మంజూరు చేయాలన్నారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర నాయుడు, మణిగండన్, నాయకులు రఘుపతిరెడ్డి, రహనాబేగం, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం లెనిన్‌నగర్, పీహెచ్‌వాడ, పార్టీ కార్యాలయాల్లో జెండాను ఆవిష్కరించి నాయకులు వందనం చేశారు. 1925 డిసెంబర్ 26న పేదల పక్షన పోరాటాలు చేయడానికి సీపీఐ పార్టీ ఆవిర్భావం చెందిందని జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల హక్కుల కోసం ఎర్రజెండాలు చేపట్టి ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. బ్రిటీష్ పాలన నుంచి సమసమాజ స్థాపన కోసం ఉద్యమిస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీరావు, మణి, విజయగౌరి, జమిలాబి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్‌కు నివాళి



సంతపేట కూడలిలో గోపీనాథ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భూపేష్, కుటుంబ సభ్యులు



అన్నదానం చేస్తున్న భూపేష్, కుటుంబసభ్యులు

చిత్తూరు కార్పొరేషన్: మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గోపీనాథ్ జయంతి సందర్భంగా స్థానిక సంతపేట కూడలిలో ఆయన కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు భూపేష్ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం తొలుత స్థానిక బజారువీధిలోని వినాయకస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గోపీనాథ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అలాగే పేదలకు అన్నదానం, సేమియా, గోధుమపిండి ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం భూపేష్ మాట్లాడుతూ తన తండ్రి గోపీనాథ్ ఎమ్మెల్యేగా, డీసీసీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా సేవలు అనేక సేవలు అందించారని, నేడు ఆయన లేనిలోటు తీరనిదన్నారు. మంత్రి పెద్దిరెడ్డితో తన తండ్రికి మంచి స్నేహం ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు చిట్టి, శీన, విజయ్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జునైద్, భూపేష్ తల్లి పద్మిని, సోదరి నిరూబా, భార్య సంగీత పలువురు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



గుడిపాల: వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ రక్షిత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని వీఎస్ అగ్రహారంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటివద్దకే ప్రభుత్వ వైద్యసేవలు

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దకే వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రక్షిత అన్నారు. మంగళవారం కుప్పిగానిపల్లె గ్రామంలో 104 వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి ముంగిటకు వైద్య సేవలను అందజేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. అనంతరం 62 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శిల్ప, సరస్వతి, శివగామి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు క్రికెట్ కిట్ అందజేత



క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. మంగళవారం మెసానికల్ మైదానంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు క్రికెట్ కిట్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అశోక్‌కుమార్, నాయకులు మహేష్, శివప్రసాద్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్‌లో..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట, సిదంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఆడుందాం ఆంధ్రా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు పలువురు విద్యార్థులు, యువకులు ఆసక్తి చూపారు. ప్రతిభ కనబరిచిన వారికి, అలాగే బీఎన్‌ఆర్‌పేటలో సర్పంచ్ త్యాగరాజులు చేతుల మీదుగా కిట్లను అందజేశారు.

అంజనాద్రిలో పౌర్ణమి పూజలు

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ అంజనాద్రిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి నుంచి వచ్చిన అంక్షింతలను నిర్వాహకులు భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా హిందూ సనాతన ధర్మాన్ని కృష్ణమూర్తి రెడ్డి, ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు ఈశ్వరయ్య భక్తులకు వివరించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.